క్లుప్తంగా

ఉద్యోగులకు సన్మానం



అడ్డాకుల: మండలంలోని పశువైద్యశాఖలో పనిచేసే ఉద్యోగులు బదిలీపై వెళ్లడంతో శనివారం వారిని సిబ్బంది సన్మానించారు. మండల పశువైద్యాధికారిగా పని చేసే డాక్టర్ మధుసూదన్ ఇటీవల అడ్డాకులకు బదిలీ అయ్యారు. అదేవిధంగా పోల్కంపల్లిలో పని చేసే వీఎల్‌ఓ సుబ్బారెడ్డి వనపర్తి జిల్లాలోని మామిడిమాడకు బదిలీ అయ్యారు. ఆయన స్థానంలో బాలానగర్ వీఎల్‌ఓ ప్రభాకర్‌ను కేటాయించారు. ముగ్గురిని జానంపేట గ్రామీణ పశువైద్య కేంద్రంలో వైద్య సిబ్బంది సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. సిబ్బంది చంద్రమోహన్‌గౌడ్, రాజేశ్వరి, సావిత్రి, రవి, శివ పాల్గొన్నారు.

ఘనంగా వార్షికోత్సవ పూజలు



దేవరకద్ర: మండల కేంద్రంలోని వాసవీ కన్యకాపరమేశ్వరి దేవాలయంలో శనివారం ఘనంగా 8 వ వార్షికోత్సవ పూజలు నిర్వహించారు. వాసవీమాతకు అభిషేకం చేశారు. ప్రత్యేకంగా అమ్మవారిని అలంకరించారు. పూజలు నిర్వహించారు. ఆలయంలో ధ్వజారోహణం, మండపారాధన కార్యక్రమాలు చేపట్టారు. అంతకుముందు గణపతి, నవగ్రహ పూజలతో వార్షికోత్సవాలను ప్రారంభించారు.

ఆంజనేయ స్వామికి అభిషేకం..



చిన్నచింతకుంట: మండల కేంద్రంలోని ఆంజనేయ స్వామి ఆలయంలో శ్రావణ మాస మొదటి శనివారం పురస్కరించుకొని జలాభిషేకం చేశారు. వీధుల్లో ఊరేగింపు నిర్వహించారు. భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. నంబిరాజు, దశరథ్, భత్తుల బాల్‌రాజు, ఆకుల అంజన్న తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారమే ధ్యేయంగా పోరాటం

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: టీఎస్‌యూటీఎఫ్ (ఉపాధ్యాయ సంఘం) ఆవిర్భావోత్సవాలను శనివారం జిల్లా కేంద్రంలోని కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. సంఘం జెండాను వ్యవస్థాపక నాయకులు రాంరెడ్డి ఎగురవేశారు. ఆవిర్భావం నాటి నుంచి సమస్యల పరిష్కారమే ధ్యేయంగా సంఘం పోరాటాలు చేస్తోందన్నారు. కరోనా వంటి విపత్కర పరిస్థితుల్లోనూ ఎంతో మందికి సహకారం అందించిందన్నారు. రాష్ట్ర నాయకులు కిష్టయ్య, జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు వెంకటేష్, రవికుమార్, రామదాసు, అజయ్, కిష్టయ్యనాయక్, జయంతి, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

పిచ్చిమొక్కల తొలగింపు

జడ్చర్ల టౌన్: మున్సిపాలిటీ పరిధిలోని శ్రీరాం నగర్‌లో స్థానికులతో పాటు, చిన్నారులు శనివారం సెలవుదినం కావటంతో పరిసరాల పరిశుభ్రతలో నిమగ్నమయ్యారు. పిచ్చిమొక్కలు పెరిగి దోమలు వస్తుండటంతో చర్యలు చేపట్టారు. పిచ్చిమొక్కలను తొలగించడంతో పాటు పరిసరాల శుభ్రం చేశారు.

రోడ్డు విస్తరణ చేపట్టాలి


మక్తల్: నియోజకవర్గ కేంద్రం నుంచి నారాయణపేట వరకు రోడ్డు విస్తరణ చేయాలని సీపీఎం జిల్లా వెంకట్‌రాంరెడ్డి డిమాండ్ చేశారు. శనివారం పట్టణంలోని ప్లకార్డులు ప్రదర్శించి నిరసన వ్యక్తం చేశారు. వారు మాట్లాడుతూ.. మక్తల్ నుంచి నారాయణపేటకు వెళ్లే రోడ్డు పూర్తిగా దెబ్బతినడంతో వాహనదారులు తీవ్రంగా ఇబ్బందులు పడుతున్నారన్నారు. అధికారులు స్పందించి ఈ రోడ్డును విస్తణ చేపట్టాలని కోరారు. కార్యక్రమంలో ఏరియ కమిటీ కార్యదర్శి ఆంజనేయులు, గోవింద్‌రాజ్, లక్ష్మణ్, సూర్యప్రకాష్, ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

విరబూసిన బ్రహ్మకమలం



నవాబుపేట: మండల కేంద్రంలోని మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ నర్సింహ చారి నివాసంలో శనివారం బ్రహ్మకమలం విరబూసింది. ఏడాదిలో ఒకేసారి విరబూసే బ్రహ్మకమలాన్ని చూసేందుకు ఇరుగు పొరుగు వారు తరలివచ్చారు. ఈ సందర్భంగా బ్రహ్మకమలం వద్ద కుటుంబ సభ్యులు పూజలు చేసి నైవేద్యాలు సమర్పించారు.

పెద్దగుట్టపై ఉత్సవాలు ప్రారంభం



పెద్దగుట్ట ,గుట్టపై కొలువైన స్వామి

- వెయ్యేళ్ల చరిత్ర కలిగిన శయనరూపంలో రంగనాయకస్వామి
- గుట్టపై స్వామి ఇచ్చిన స్ఫూర్తితో గోనబుద్దారెడ్డి రంగనాథ రామాయణం రచన

జడ్చర్ల టౌన్: శ్రావణమాసం రాగానే పెళ్లిళ్లు, శుభకార్యాలు, నోములు, వ్రతాలకు పెట్టింది పేరు. వీటన్నింటితోపాటు బాదేపల్లిలో పెద్దగుట్టపై లక్ష్మీసమేతంగా వెలసిన రంగనాయకస్వామి ఉత్సవాలు గుర్తుకు వస్తాయి. ఏటా శ్రావణమాసంలో గుట్టపై ఉన్న ఆలయానికి ఉమ్మడి జిల్లాతోపాటు హైదరాబాద్ తదితర ప్రాంతాల నుంచి సైతం భక్తులు తరలి వస్తుంటారు. వెయ్యేళ్ల చరిత్ర కలిగిన ఈ దేవాలయానికి ఉన్న పెద్దగుట్ట భూమి నుంచి 750అడుగుల ఎత్తులో ఉంటుంది. గుట్టపై భాగాన శయనభంగిమలో లక్ష్మి సమేతంగా రంగనాథస్వామి స్వయంభూగా వెలిశాడని ప్రతీతి. జడ్చర్ల వాసులతోపాటు చుట్టు పక్కల వారికి కొంగుబంగారమై అలరారుతున్న రంగనాయకుని వైభవం అంతాఇంతా కాదు.

గుండంలో నిరంతర నీటి జాలు (ఊట)

స్వయంభుగా వెలసిన లక్ష్మీరంగనాథ స్వామి ఆలయం ఎదురుగా రాళ్ల మధ్యలో నీటిగుండం వెలసింది. ప్రకృతి సిద్ధంగా వెలసిన గుండంలో నిరంతరం నీటిజాలు (ఊట)వస్తూనే ఉంటుంది. బాదేపల్లి చుట్టుపక్కల గ్రామాల రైతులు తమ పంటలకు పట్టిన చీడపురుగుల నివారణ కోసం ఈ నీటిని తీసుకువెళ్లి చల్లుతుంటారు. విపరీతమైన కడుపునొప్పితో బాధపడేవారు, రుతుక్రమంలో సహజ సిద్ధంగా వచ్చే కడుపునొప్పి నివారణకు గుండంలోని తాగిస్తారు. ఇలాంటి గుండం పూడ్చివేయటం, ఇటీవల దాన్ని పునరుద్ధరించటం జరిగింది. ఈ గుండంకు మండలంలోని గంగాపురం లక్ష్మీచెన్నకేశవస్వామి ఆలయ కోనేరుకు సంబంధం ఉందని, ఇక్కడి నీరు కోనేరులోకి వెళ్తుందని పూర్వీకులు చెబుతుంటారు.

రంగనాథరామాయణం రచనకు స్ఫూర్తి

13వ శతాబ్దంలో ఈ ప్రాంతం (ప్రస్తుత తిమ్మాజీపేట మండలం బుద్ధసముద్రం)లో నివసించిన గోనబుద్దారెడ్డి రాసిన తొలి తెలుగు రామాయణం రచించేందుకు స్ఫూర్తి రంగనాయకస్వామిగా చరిత్ర చెబుతుంది. ఆయన పెద్దగుట్టపై ఉన్న ఈ ఆలయానికి వచ్చినప్పుడే రామాయణాన్ని తెలుగులో రచించాలని మనసులో మెదిలిందని, అందుకే సింహభాగం రామాయణాన్ని ఇక్కడే రాశారని ప్రతీతి. ఈ కారణంగానే ఆయన రామాయణానికి రంగనాథ రామాయణం అని పేరు పెట్టారు.

అట్టహాసంగా ఉత్సవాలు ప్రారంభం

శ్రావణమాసం ప్రారంభం కావటంతో ఉత్సవాలకు భక్తులు పెద్ద సంఖ్యలో తరలి వస్తున్నారు. నిత్యపూజలతోపాటు వ్రతాలు సైతం నిర్వహిస్తున్నారు. ఇప్పటికే ఉత్సవాలకు సంబంధించి పెద్ద ఎత్తున ప్రచార కార్యక్రమాలు చేపట్టారు. సిగ్నల్‌గడ్డ వద్ద స్వాగత కమాన్ సైతం ఏర్పాటు చేసి ప్రజలను ఆకట్టుకుంటున్నారు.

ఎంతో చరిత్ర ఉంది

బాదేపల్లి పెద్దగుట్టకు వెయ్యేళ్లకుపైగా చరిత్ర ఉంది. స్వయంభూగా లక్ష్మీసమేతంగా విష్ణుమూర్తి రంగనాథస్వామిగా వెలిశారు. పెద్దగుట్టపై ఆలయంలో దూపదీప నైవేద్యాలు పెడితే ఈ ప్రాంత ప్రజలు సుభిక్షంగా ఉంటారని మా పూర్వీకులు చెప్పేవారు.
– సాకేత్ ప్రవీణ్, కవి, రచయిత, జడ్చర్ల

నెలరోజుల పాటు ఉత్సవాలు

శ్రావణమాసం నెలరోజుల పాటు ఉత్సవాలు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశాం. కోనేరు పూడ్చివేసినందుకు గాను శుక్రవారం మహా సంప్రోక్షణ జరిపించి ఆలయాన్ని శుద్ధి చేయించాం. మెట్ల మార్గాన్ని పునరుద్ధరించాం. వాహనాలతోనూ గుట్టపైకి రావచ్చు.
– కాల్వ రాంరెడ్డి, అధ్యక్షుడు, రంగనాయక ఆలయ పరిరక్షణ కమిటీ

పోటెత్తిన భక్తులు

బాదేపల్లి పెద్దగుట్టపై శ్రావణశోభ వెల్లివిరిసింది. రెండో శనివారం సెలవుదినం కావటం, ఆలయ పరిరక్షణ కమిటీ ఉత్సవాలు పెద్ద ఎత్తున నిర్వహిస్తుండడంతో భక్తులు పోటెత్తారు. లక్ష్మీసమేత రంగనాథుడిని దర్శనం చేసుకుని పూజలు చేశారు. పరిరక్షణ కమిటీ అధ్యక్షుడు కాల్వరాంరెడ్డి భక్తులకు అన్నదానం చేశారు. కోనేరు పునఃరుద్ధరించి నీరు నింపినప్పటికీ సహజసిద్ధంగా అనిపించకపోవటంపై భక్తులు కొంత అసంతృప్తి వ్యక్తం చేశారు. పెద్దగుట్టపైకి లక్ష అడుగులు లక్ష్యంతో ఫ్లెవాక్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన ట్రెక్కింగ్ శనివారం విజయవంతంగా ముగిసింది.



గుట్టపై బతుకమ్మ ఆడుతున్న మహిళలు



పెద్దగుట్టపై పునరుద్ధరించిన కోనేరు



గుట్టపై అన్నదానం

ఉద్యోగులను విస్మరించడం తగదు



మాట్లాడుతున్న ఫారుఖ్ హుస్సేన్

స్టేషన్ మహబూబ్‌నగర్: కాంగ్రెస్ ప్రభుత్వం మేనిఫెస్టోలో పేర్కొన్న ప్రకారం సమస్యలు పరిష్కరించడం లేదని ఆల్‌మేవా రాష్ట్ర అధ్యక్షుడు షేక్ ఫారుఖ్ హుస్సేన్ అన్నారు. జిల్లా కేంద్రం షాసాబ్ గుట్టలోని సంఘం కార్యాలయంలో శనివారం సమావేశంలో మాట్లాడారు. ఎన్నికల వేళ ఒక విధంగా.. తర్వాత మరో విధంగా ప్రభుత్వ వైఖరి ఉందన్నారు. ఉద్యోగులను విస్మరించడం తగదన్నారు. వెంటనే ఉద్యోగస్తుల ఆర్థిక సమస్యలను పరిష్కరించాలని, ఉద్యోగ విరమణ పొందిన వారి ఆర్థిక ప్రయోజనాలు చెల్లించాలని విజ్ఞప్తి చేశారు. జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఎండి.ఇష్రత్‌అలీ, మహ్మద్ అయూబ్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు డాక్టర్ వహీద్‌షా, కోశాధికారి ఎండి.రషీద్, నాయకులు పాల్గొన్నారు.

ఆర్థికసాయం

దేవరకద్ర: మండల కేంద్రానికి చెందిన వాకిటి కృష్ణయ్య శనివారం మృతి చెందగా వారిది పేద కుటుంబం కావడంతో జీకేఆర్ ఫౌండేషన్ తరపున ఆర్థికసాయం అందజేశారు. ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి ఆదేశాలతో జీకేఆర్ ఫౌండేషన్ చైర్మన్ కోన రాజశేఖర్ బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. నాయకులు తదితరులు ఉన్నారు.

బాధితుడికి పరామర్శ



అడ్డాకుల: కందూర్‌కి చెందిన బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు రాచాల ప్రభాకర్‌రెడ్డి అనారోగ్యానికి గురవడంతో శనివారం దేవరకద్ర మాజీ ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి పరామర్శించారు. ఆరోగ్య పరిస్థితి గురించి వాకబు చేసి త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో విండో చైర్మన్ జితేందర్‌రెడ్డి, జెడ్పీ మాజీ కోఆప్షన్ మహిమూద్, తిరుపతయ్య యాదవ్, రమేష్‌గౌడ్, చల్మారెడ్డి, ఖాజాషౌరీ, శ్రీనివాస్ యాదవ్ ఉన్నారు.

సమస్యల వలయంలో పశువైద్య కేంద్రం



శిథిలావస్థకు చేరిన పశువైద్య కేంద్రం

అడ్డాకుల: మూసాపేట మండలం జానంపేట గ్రామంలో ఉన్న గ్రామీణ పశువైద్య కేంద్ర భవనం శిథిలావస్థకు చేరింది. భవనం పైకప్పు నుంచి వర్షం నీళ్లు కిందికి కారుతున్నాయి. దీనివల్ల గోడలు సైతం శిథిలావస్థకు చేరాయి. వర్షాకాలంలో భవనం లోపల ఉండటానికి సిబ్బంది ఇబ్బందులు పడాల్సి వస్తోంది. పైకప్పు నుంచి నీళ్ల కారడంతో భవనం లోపల ఉన్న మందులు కూడా తడిసే పరిస్థితి నెలకొంది. భవనం బయట తలుపుపై ఉన్న స్లాబ్‌పై గడ్డి మొలిచింది. భవనం గదికి ఉన్న తలుపు కూడా కొంత విరిగిపోయి ఉంది. ఇంతే కాకుండా ఇక్కడ కరెంటు కనెక్షన్ లేదు. గదిలో చీకటిగా ఉండగా కిటికీల వెలుతురులోనే సిబ్బంది పని చేస్తున్నారు. మూగజీవాలకు అవసరమయ్యే మందులను నిల్వ చేయడానికి ఫ్రీజ్ కూడా అందుబాటులో లేదు. భవనం చుట్టూ ఉన్న ప్రహరీ కూడా అసంపూర్తిగా ఉంది. గతంలో కొంత వరకు ప్రహరీ పనులు చేసి వదిలేశారు. దీనివల్ల రాత్రివేళ అసాంఘిక కార్యకలాపాలు సాగే అవకాశం ఉంది.. ఇప్పటికైనా సమస్యల వలయంలో ఉన్న గ్రామీణ పశువైద్య కేంద్రంపై ఉన్నతాధికారులు దృష్టి సారించి సమస్యలను పరిష్కరించాల్సిన అవసరముంది.



విరిగిపోయిన కేంద్రం తలుపు

నేతాజీ విగ్రహానికి పూజలు చేసిన నాయకులు



నేతాజీ విగ్రహం వద్ద నాయకులు

జడ్చర్ల టౌన్: బీజేపీ జాతీయ అధ్యక్షుడు జగత్‌ప్రకాష్ నడ్డా ఆదేశాల మేరకు శనివారం పట్టణంలోని నేతాజీ చౌరస్తాలో.. నేతాజీ విగ్రహం చుట్టూ పరిశుభ్రత చర్యలు చేపట్టారు. ఈ మేరకు విగ్రహానికి పూలమాలలు వేసి పూజలు చేశారు. కార్యక్రమాన్ని ఉద్దేశించి రాష్ట్ర కౌన్సిల్ మెంబర్ కృష్ణయ్య మాట్లాడారు. ప్రధాని పిలుపు మేరకు ప్రతి ఒక్కరు ఇంటిపైన జాతీయ జెండా ఎగురవేయాలని కోరారు. కార్యక్రమంలో పట్టణ అధ్యక్షుడు నాగరాజు, కిసాన్ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షుడు యం.బి. బాలకృష్ణ, అసెంబ్లీ కో కన్వీనర్ నర్సింహులు, సీతారాం, వెంకట్, శ్రీనివాస్‌గౌడ్, మురళి, అమర్‌నాథ్‌గౌడ్, నాగరాజు, పిట్టల నరేష్ పాల్గొన్నారు.

పాలమూరులో మరో 'పిల్లలమర్రి'!

రాజాపూర్: పిల్లల మర్రి అంటే మహబూబ్‌నగర్ జిల్లాకు ఓ ప్రత్యేక గుర్తింపు. పెద్దగా విస్తరించి ఉన్న మర్రిచెట్టును చూడటానికి ఎక్కడెక్కడి నుంచో పర్యాటకులు వస్తుంటారు. అయితే రాజాపూర్ మండలం మల్లేపల్లి శివారులో సోమ్లానాయక్ తండాకు పక్కనే మరో పిల్లలమర్రి విస్తరిస్తోందని మీకు తెలుసా? 20 గుంటల పొలంలో చాలా ఏళ్ల నుంచి ఓ పెద్ద మర్రిచెట్టు ఇక్కడ విస్తరిస్తోంది. దీంతో చుట్టు పక్కల గ్రామాల ప్రజలు దీనిని చూడడానికి తరలివస్తున్నారు. పాలమూరులో మరో పిల్లలమర్రి అని పేర్కొంటున్నారు. త్వరలోనే ఈ ప్రాంతం పర్యాటకంగా అభివృద్ధి చెందే అవకాశం ఉందని చెబుతున్నారు.



మల్లేపల్లిలో విస్తరించిన మర్రిచెట్టు ఇదే..

అటెన్షన్ ప్లీజ్

నడి రోడ్డుపై విద్యుత్ స్తంభాలు



మండల కేంద్రంలో విస్తరణలో భాగంగా ఏడాదిన్నర క్రితం రోడ్డు వేశారు. కాగా అప్పటి నుంచి నడిరోడ్డులో విద్యుత్ స్తంభాలు ప్రమాదకరంగా ఉన్నాయి. అయినా ఎవరూ పట్టించుకోవడంలేదు. ఏదైనా ప్రమాదం జరిగితే తప్ప స్పందించరా అంటు స్థానికులు అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా వాటిని తొలగించాల్సిన అవసరముందని చెబుతున్నారు. – నవాబుపేట

సంప్రదించాల్సిన అధికారి : సంతోష్, విద్యుత్, ఏఈ, ఫోన్: 94408 13463

గిరిజనులపై వివక్ష చూపుతున్న కాంగ్రెస్



మాట్లాడుతున్న లక్ష్మణ్‌నాయక్

మహబూబ్‌నగర్ రూరల్: రాజకీయ నామినేటెడ్ పోస్టుల భర్తీలో, పార్టీ పదవుల్లో ఒక్కటి కూడా ఇవ్వకుండా కాంగ్రెస్ గిరిజనులపై వివక్ష చూపుతోందని.. గిరిజన సేవా సంఘం అధ్యక్షుడు డి.లక్ష్మణ్‌నాయక్ అన్నారు. శనివారం జిల్లా కేంద్రంలో సమావేశంలో మాట్లాడారు. గిరిజనులకు ఇచ్చిన హామీలు ఇప్పటికీ నెరవేర్చలేకపోయిందని అన్నారు. సేవాలాల్ కార్పొరేషన్, మైదాన ప్రాంతాల్లో ఉన్న గిరిజనులకు ఐటీడీఏ ప్రాజెక్టు ఏర్పాటు చేస్తామని ఎన్నికల సమయంలో హామీ ఇచ్చారని అన్నారు. అంతేకాక గిరిజనులకు స్థానిక సంస్థల్లో రోస్టర్ పద్ధతిలో స్టేట్ యూనిట్ కాకుండా జిల్లాను యూనిట్‌గా తీసుకొని అమలు చేస్తామన్నారని గుర్తుచేశారు. ఎస్సీ, ఎస్టీ కమిషన్ వేర్వేరు చేస్తామని అదీ కూడా చేయలేకపోయారని అన్నారు. గిరిజన బంధు రూ. 12 లక్షలు, బ్యాక్‌లాగ్ పోస్టులు భర్తీ చేస్తామని చెప్పి ఇప్పటి వరకు ఖాళీల గుర్తింపు జరగలేదని అన్నారు. గిరిజనులను మాయ చేసి ఓట్లు వేయించుకొని గెలిచిన కాంగ్రెస్ వివక్ష చూపడం సమంజసం కాదన్నారు. సంఘం ప్రధాన కార్యదర్శి ప్రతాప్‌నాయక్, కోశాధికారి కిషన్‌నాయక్ పాల్గొన్నారు.

గాంధీజీ విగ్రహానికి వినతి అందజేత



వినతిపత్రం ఇస్తున్న మున్సిపల్ కార్మికులు

జడ్చర్ల టౌన్: మున్సిపల్ కార్మికులు శనివారం కార్యాలయ ప్రాంగణంలోని గాంధీజీ విగ్రహానికి వినతిపత్రం సమర్పించారు. మున్సిపాలిటీ అధికారులు, పాలకుల నిర్లక్ష్యం వల్ల సమస్యలు అపరిష్కృతంగా ఉన్నాయని వాపోయారు. మున్సిపల్ వర్కర్స్ ఎంప్లాయిస్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు వెంకటేశ్ పరిష్కరించగలిగే సమస్యలను సైతం పట్టించుకోవడం లేదని ఆరోపించారు. మున్సిపల్ కార్మికులు కృష్ణ, చంద్రమౌళి, యాదయ్య, జంగయ్య, భారతి, లక్ష్మమ్మ, గణస్తష విద్యాసాగర్, కొండయ్య పాల్గొన్నారు.

ప్రతిపౌరుడు బాధ్యతగా ఉండాలి



పాలమూరు: దేశం విషయంలో ప్రతీ భారతీయుడికి అవగాహన కల్పించడమే లక్ష్యంగా ప్రధాని మోదీ హర్ ఘర్ తిరంగా కార్యక్రమానికి శ్రీకారం చుట్టారని బీజేపీ రాష్ట్ర కోశాధికారి బండారి శాంతికుమార్ అన్నారు. కార్యక్రమంలో భాగంగా శనివారం జిల్లా కేంద్రంలోని ఆయన నివాసంపై జాతీయ జెండాను ఏర్పాటు చేశారు. అదేవిధంగా ర్యాలీలు, మహనీయుల విగ్రహాల వద్ద పరిశుభ్రత కార్యక్రమాలు చేపడుతున్నట్లు వివరించారు. ప్రతిపౌరుడు దేశం విషయంలో బాధ్యతగా వ్యవహరించాలన్నారు. హర్ ఘర్ తిరంగాలో భాగంగా శనివారం పట్టణంలోని కొత్త గంజ్, హనుమాన్ నగర్‌లో 47వార్డు శక్తికేంద్రం ఇంచార్జీ దర్పల్లి హరికృష్ణ ఆధ్వర్యంలో జాతీయ జెండాలు పంపిణీ చేశారు. బీజేపీ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్‌రెడ్డి హాజరై కాలనీ వాసులకు జాతీయ జెండాలు అందించారు.

శివశంకర్ సేవలు మరువలేం



పి.శివశంకర్ జయంతి కార్యక్రమంలో పాల్గొన్న సంఘాల నాయకులు

స్టేషన్ మహబూబ్‌నగర్: బీసీలకు రిజర్వేషన్లు అందించడంలో పి.శివశంకర్ కృషి అమోఘమని.. ఆయన సేవలు మరువలేమని బీసీ సమాజ్ రాష్ట్ర కార్యదర్శి ఎం.శ్రీనివాస్‌సాగర్ అన్నారు. జిల్లా కేంద్రంలోని ఉమ్మడి జిల్లా కార్యాలయంలో శనివారం శివశంకర్ జయంతి నిర్వహించారు. చిత్రపటానికి పూలమాలలు వేశారు. శ్రీనివాస్‌సాగర్ మాట్లాడుతూ కేంద్రస్థాయిలో మండల కమిషన్ ప్రక్రియను అమలులో ఆయన పాత్ర ఎంతో ఉందన్నారు. 1993 నుంచి కేంద్ర ప్రభుత్వ సర్వీసులో కూడా దేశవ్యాప్తంగా బీసీ రిజర్వేషన్లు అనుభవించడంలో కూడా ఆయన పాత్రే కీలకమని అన్నారు. ఇప్పటికైనా బీసీలందరూ మేల్కొని అధికారాన్ని చేజిక్కించుకోవాలని పిలుపునిచ్చారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో ఎస్సీ, ఎస్టీ స్థానాలు తప్పా మిగతా అన్నింటిలో బీసీలు పోటీలో నిలబడి గెలిచినప్పుడే శివశంకర్‌కు ఘనమైన నివాళి అర్పించిన వారమవుతామని అన్నారు. కార్యక్రమంలో జాంగ్రసంఘం జిల్లా అధ్యక్షుడు మహేందర్, సగర సంఘం మాజీ జిల్లా అధ్యక్షుడు ప్రేమ్‌సాగర్‌తో పాటు ఆయా సంఘాల నాయకులు బుగ్గన్న, సారంగి లక్ష్మీకాంత్, దుర్గేష్, గంజి ఆంజనేయులు, ఆశన్న ముదిరాజ్, వెంకటేశ్, సవారి సత్యం, కేశవులు పాల్గొన్నారు.

మహబూబ్‌నగర్ రూరల్: కేంద్ర మాజీ మంత్రి శివశంకర్ జయంతిని మున్నూరుకాపు ఉద్యోగులు, రిటైర్డ్ ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. సంఘం జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్, గౌరవ అధ్యక్షుడు బుక్క స్వామి, ప్రధాన కార్యదర్శి శ్రీనివాసులు, కోశాధికారి సత్యనారాయణ, రాష్ట్ర ఉపాధ్యక్షుడు పురుషోత్తం తదితరులు పాల్గొన్నారు.